
సాక్షి ఒడిశా

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4.01.576లు. వచ్చాయని అధికారులు తెలిపారు.



అకాల వర్షాలతో నష్టం

అకాల వర్షాలతో రైతులు నష్టపోయారు. వరి పంటకు నష్టం వాటిల్లింది.

- 8లో.



అందాలకు నిలయం గజపతి

గజపతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 8లో.

న్యూస్‌రీల్

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ప్రసంగిస్తున్న దినేష్

రాయగడ: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ యోగా గురు దినేస్ టంక్ అన్నారు. స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ కుమార్ నేతృత్వంలో ప్రపంచ మెడిటేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిటీ కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం, యోగా వంటివి క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న డాక్టర్ జీవీ రమణ, కింతలి నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



బృందావన్ హరిజన్ మృతదేహం

జయపురం: జయపురం సమితి 26వ నంబర్ జాతీయ రహదారి రొండాపల్లి సమీప బిశాయిపుట్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. మరణించిన వ్యక్తి జయపురం సమితి ఛొత్రిపుట్ గ్రామానికి చెందిన బృందావన హరిజన్(30)గా జయపురం సదర్ పోలీసుస్టేషన్ ఏఎస్ఐ మనువ బిడిక శనివారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బృందావన్ తన గ్రామం నుంచి ఏదో పని నిమిత్తం బైక్‌పై శుక్రవారం జయపురం వచ్చాడు. పని ముగించుకొని తిరిగి తమ గ్రామం వెళ్తుండగా 26వ నంబర్ జాతీయ రహదారిపై బిశాయిపుట్ వద్ద వేయింగ్ వంతెన వద్ద నిలబెట్టి ఉన్న ఒక లోడు ట్రక్కును వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బృందావన్‌ను స్థానికులు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ విషయం తెలిసిన సదర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. బిశాయిపుట్ వద్ద వేయింగ్ బ్రిడ్జి ఉండడం వలన అనేక ట్రక్కులు నిలిచి ఉంటున్నాయి. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఎలుగుబంటి మృతి

జయపురం: ఈనెల 18వ తేదీన జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి మంకిడిగుడ గ్రామ సమీపంలోని ఒక చెట్టుపై నుంచి ఎలుగుబంటి కిందపడి జయపురం పశు చికిత్స కేంద్రంలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ ఎలుగుబంటి శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు అటవీ విభాగ అధికారులు శనివారం వెల్లడించారు. 30 అడుగుల ఎత్తు ఉన్న చెట్టుపై నుంచి కిందిపడగా తల, నడుముకు బలమైన గాయాలయ్యాయి. అటవీ అధికారులు, పశు వైద్యులు సంఘటన స్థలానికి వెళ్లి అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం జయపురం తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఎక్సరే తీసేందుకు నవరంగపూర్ తీసుకెళ్లారు. ఎలుగుబంటి పరిస్థితి విషమంగా ఉండడం వలన నందన్‌కానన్ తీసుకెళ్లమని నవరంగపూర్‌లో డాక్టర్ సూచించారు. అయితే అటవీ అధికారులు దానిని జయపురం బొమినిగాంలోని నర్సరీకి తీసుకొచ్చి ఉంచారు. ఒకరోజు తర్వాత నందన్‌కానన్‌కు తీసుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు. అయితే శుక్రవారం సాయంత్రం ఎలుగుబంటి మరణించింది. అధికారులు కాలయాపన చేయడంతో సకాలంలో చికిత్స అందక ఎలుగుబంటి మరణించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పెట్రోల్ పోసుకుని వృద్ధుడు ఆత్మహత్య

జయపురం: జయపురం బమునిగాం గ్రామంలో ఒక 60 ఏళ్ల వృద్ధుడు శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఆ వ్యక్తిని బమునిగాం గ్రామానికి చెందిన టి.బాబూరావుగా గుర్తించారు. ఈ సంఘటనపై జయపురం సదర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం..ఈ నెల 19వ తేదీ రాత్రి బాబూరావు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సమీప పెట్రోల్ బంకుకు వెళ్లి ఒక బాటిల్ పెట్రోల్ కొన్నాడు. బీడీ కాల్చేందుకు పక్క దుకాణంలో అగ్గిపెట్టె అడిగి తీసుకున్నాడు. విజయవాడ-రాంచీ 326 జాతీయ రహదారి పక్కనగల ఒక చెట్టు కింద కూర్చొని పెట్రోలు పోసుకొని అగ్గిపుల్ల గీసి నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెట్టు కింద మంటలు రావటం చూచిన ప్రజలు పోలీసులకు ఫోన్ చేయగా ఎస్ఐ శిరీష మహాపాత్రో, ఏఎస్ఐ సుశాంత కుమార్ దళపతి, పంకజిని శబరలు పోలీసులతో సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే బాబూరావు పూర్తిగా కాలిపోయాడు. మృతుని కుమారుడు వచ్చి మృతదేహాన్ని గుర్తించాడు.

కడలి ఒడిలో.. అలల సడిలో



పర్యాటకుల వసతి శిబిరాలు

సండే స్పెషల్





కాంతులీనుతున్న కోణార్క్ ఎకో రిట్రీట్ పర్యటన ప్రాంగణం (ఇన్‌సెట్లో) కోణార్క్ ఎకో రిట్రీట్ పర్యాటకుల స్వాగత తోరణం

- కోణార్క్‌లో ఆకట్టుకుంటున్న ఎకో రిట్రీట్

భువనేశ్వర్: రామచండీ సాగర తీరం రారమ్మంటూ పర్యాటకులను పిలుస్తోంది. ప్రఖ్యాత కోణార్క్ పర్యాటక క్షేత్రం కొత్త సొబగులతో ఆకర్షిస్తోంది. ఇక్కడ ఎకో రిట్రీట్ విశేష ప్రాచుర్యం పొందుతోంది. రామ చండీ సాగర తీరంలో డేరాల్లో బస చేయడం ఓ మరపు రాని అనుభూతిగా మిగులుతోంది. ప్రకృతి సహజమైన సముద్ర అలల సవ్వడి మధ్య చల చల్లని వాతావరణంలో అనుకూలమైన భోజనం, అల్పాహారం, పానీయాలతో ఆహ్వానించే రెస్టారెంట్లు, సాగర తీర వాలీబాల్ వంటి ఆటల ప్రాంగణాలు, చల్లని సంధ్య వేళలో వీనుల విందైన గానా బజానాతో ఈ ఏర్పాట్లు ఉన్నాయి. పగటి పూట వెచ్చటి సూర్య కాంతి, చీకటి పూట చల్లని చంద్ర కాంతుల మధ్య సాగర సౌందర్యం పర్యాటకులకు ఎన్నో మరువలేని జ్ఞాపకాల్ని మిగుల్చుతుంది. పర్యటన ప్రియుల కోసం కోణార్క్ ఎకో రిట్రీట్ స్వాగతం పలుకుతోంది.

చక్కటి ప్రణాళికతో ...

చక్కని ముందస్తు ప్రణాళికతో కోణార్క్ ఎకో రీట్రీట్ పర్యటనను ఆస్వాదించవచ్చు. పర్యటనకు వీలైన రోజుల్లో పర్యటించేందుకు ముందస్తుగా వసతి వగైరా సౌకర్యాల్ని రిజర్వు చేసుకోవడం అత్యంత సులభం. ఆకస్మిక పరిస్థితులతో చివరి క్షణంలో ప్రణాళిక ప్రకారం పర్యటన రద్దు చేసుకునేందుకు వెసులుబాటు అందుబాటులో ఉంది. అప్పటికప్పుడు పరిస్థితుల దృష్ట్యా ముందస్తుగా చెల్లించిన సొమ్ము ఫిరాయింపు విషయాన్ని అనుబంధ వర్గాలు ఖరారు చేస్తాయి.



సువిశాల భోజన రెస్టారెంట్లు



కిక్కు ఇచ్చే బీచ్ బార్



పర్యాటకుల శిబిరంలో లివింగ్ రూమ్



డేరా శిబిరంలో విలాసవంతమైన పడక గది

కోణార్క్‌ఎకో రీట్రీట్ చేరడం ఇలా

విమానయానం

భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి 81 కిలోమీటర్లు–2 గంటలు రహదారి ప్రయాణం

రైలు సౌకర్యం

స్టేషను	దూరం (కిలో మీటర్లు)	ప్రయాణం నిడివి (గంటలు)
భువనేశ్వర్	81	1.30
కటక్	104	2.00
పూరీ	29	44 నిమిషాలు

రోడ్డు మార్గం

ప్రాంతం	దూరం (కిలో మీటర్లు)	ప్రయాణం నిడివి (గంటలు)
భువనేశ్వర్	85	1.50
పూరీ	29	40 నిమిషాలు
కటక్	104	2.10
జంషెడ్‌పూర్ (బరిపద, బాలాసోర్ మీదుగా)	470	9 గంటలు 30 నిమిషాలు ప్రయాణం
విశాఖపట్నం (బరంపురం మీదుగా)	473	9.30
కోల్‌కతా (బాలాసోర్, భద్రక్ మీదుగా)	529	11.00

వసతి చార్జీలు

కోణార్క్ రామ చండీ సాగర తీరంలో పర్యావరణ పర్యటన కోసం ఆకట్టుకునే డేరాల శిబిరాల వసతి సదుపాయం 4 వర్గాల కింద అందుబాటులో ఉంటుంది. డీలక్స్ స్విస్ కాటేజ్, ప్రీమియం స్విస్ కాటేజ్, రాయల్ లగ్జరీ స్విస్ కాటేజ్, ప్రెసిడెన్షియల్ సూట్ 4 రకాల విలాసవంతమైన వసతి శిబిరాలు పర్యాటకుల కోసం అందుబాటులో ఉన్నాయి. వీటి చార్జీలు రూ. 5 వేలు నుంచి రూ. 20 వేలు వరకు ఉంటుంది. పర్యాటకుల ఆసక్తికి అనుకూలంగా వీటిని ముందస్తుగా బుక్ చేసుకోవడం మంచిది. బుకింగ్ కోసం 0674 262 33 00 నంబర్‌ను సంప్రదించాలి. చెక్ ఇన్ సమయంలో పర్యాటకులు అందరు ఫొటో గుర్తింపు పత్రం లేదా కార్డు రుజువు దాఖలు చేయాల్సి ఉంటుంది.



కోణార్క్ రామ చండీ సాగర తీరం పాదవునా వెలసిన పర్యావరణ దేరా శిబిరాల వసతి సముదాయం



సాగర తీరం కాలక్షేపం - బీచ్ వాలీ బాల్



సాగర తీర డేరా శిబిరం

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఇడితాల్ పేరిట నిర్వహిస్తున్న చైతీ ఉత్సవాల్లో భాగంగా మహిళల మధ్య శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో సాగరిక శతపతి ప్రథమ బహుమతి, స్వాతి బౌరి ద్వితీయ, బిరాజని సబర్ తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. అదేవిధంగా మ్యూజికల్ చైర్ పోటీలు కూడా జరిగాయి. సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట పోటీలను ప్రారంభించారు. ఈ ఏడాది వర్షాలు కారణంగా చైతీ ఉత్సవాల్లో కొంత ఇబ్బంది ఎదురయ్యిందన్నారు.



ఉత్సాహంగా మ్యూజికల్ చైర్ పోటీల్లో మహిళలు

భూగర్భ జలాలు అంతరిస్తే సమస్యలు

- కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: భూగర్భ జలాలు అంతరించిపోతే భవిష్యత్తులో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని గజపతి కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాల్‌లో భూగర్భ జలాల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జియాలజిస్టు రాజకిషోర్ మహంతి మాట్లాడుతూ.. గజపతి జిల్లాలోని కాశీనగర్ బ్లాక్ మధుసూదనపూర్, శియ్యాళి పంచాయతీ సింగిపురం గ్రామాల్లో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ ఉన్నట్లు తమ పరిశోధనల్లో తేలిందన్నారు. జిల్లాలో సాధారణ వర్షపాతం 1,400 నుంచి 1,500 మిల్లీ మీటర్లు ఉందని, దీంతో ఇప్పట్లో జిల్లాకు నీటి సమస్య తలెత్తే అవకాశాలు లేవన్నారు. అనంతరం కలెక్టర్ బిజయ కుమార్‌దాస్ జియాలజిస్టు రాజకిషోర్ మహంతిని జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో వైజ్ఞానికుడు రాజకిషోర్ మహంతి, కేంద్ర జలశక్తి బోర్డు, ప్రోగ్రాం ఆఫీసర్ అపూర్వ బెరా, జిల్లా జీవనోపాధుల శాఖ అధికారి విద్యాసాగర్ ముదులి, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా.గుణనిధి నాయక్, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీరు జ్యోతిరాజ్, వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ అధికారి సురేష్ పట్నాయక్, ఉద్యానవనాల శాఖ సంచాలకులు సుశాంత రంజన్ దాస్, డిప్యూటీ డైరెక్టర్ వెంకట్రావు ఆచారి, చిన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జియాలజిస్టు రాజకిషోర్ మహంతి

పెన్షన్ ఆందోళనలో జయపురం ప్రతినిధులు



ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్న జయపురం ప్రతినిధులు

జయపురం: కనీస పెన్షన్ రూ.9వేలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ పెన్షనర్ల అసోసియేషన్ ఈ నెల 18, 19 తేదీల్లో న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో జయపురం నుంచి పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు గౌరీ శంకర దాస్, పి.రామకృష్ణ రావు పాల్గొన్నారు. ఇప్పటికైనా పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ అంగీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కొట్‌పాడ్ చేనేత కార్మికులపై అధ్యయనం



నేత కార్మికులతో చర్చిస్తున్న పర్యాటక కార్యదర్శి బొలబంత సింగ్



సొసైటీ పెద్దలతో చర్చిస్తున్న సింగ్, కలెక్టర్ తదితరులు

జయపురం: నేత వస్త్రాలకు పేరుగాంచిన జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితిలో సునారబెలి నువాగాం గ్రామ పంచాయతీ డొంగరగుడ గ్రామంలో చేనేత పనివారిని శనివారం రాష్ట్ర పర్యాటక విభాగ కార్యదర్శి బొలబంత సంగ్ కలిశారు. ఆ గ్రామంలో చేనేత కార్మికుల ఉమ్మడి సంక్షేమ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బొలబంత సింగ్‌కు గ్రామస్తులు పూల మాలలు వేసి సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. అక్కడి టెక్స్‌టైల్స్ కోఆపరేటివ్ వీవింగ్ ఫెసిలిటీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. నేత కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, కొట్‌పాడ్ బీడీఓ బిక్రమ దొర, తహసీల్దార్ మహంతి నీలకంఠం నాయుడు, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర, నవరంగపూర్ ఎంపీ ప్రతినిధి ఖగేశ్వర జెన, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర భొత్ర, మనోజ్ భొత్ర, ప్రభుత్వ ఇంజినీర్ సంతోష్ బాగ్ సింగ్, బినాయక ఆచార్య, సునారబెలి నువాగా సర్పంచ్, దేవ మఝి,సమితి సభ్యులు దేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

పురోగతికి నిధులు కావాలి: ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్ర పురోగతి వేగం పుంజుకోవాలని, మౌలిక వనరుల మద్దతుతో పర్యాటక రంగం, పట్టణీకరణ, పెట్టుబడుల ప్రోత్సాహంతో పారిశ్రామిక, వర్తక వ్యాపార రంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆదరణ ఎంతైనా అవసరమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభ్యర్థించారు. 2025–26 ఆర్థిక సంవత్సరం కేంద్ర బడ్జెట్ రూపకల్పన ముందస్తు యోచన సమావేశం సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర పురోగతి దృష్ట్యా కొత్త బడ్జెటులో రాష్ట్రానికి అధికంగా నిధులు కేటాయించాలని వినతి పత్రం సమర్పించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వర్గాలు తెలిపాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాజస్థాన్ జైసల్మేర్‌లో జరిగిన కొత్త ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ సంప్రదింపుల సమావేశానికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరయ్యారు. ఆయనతో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి శాశ్వత్ మిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర పురోగతి కోసం అధిక నిధుల కేటాయింపు కోసం కీలకమైన ప్రతిపాదనల్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి సమర్పించారు. ఈ ప్రతిపాదనలను అధ్యయనం చేసిన మేరకు తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. 2025–26 ఆర్థిక సంవత్సరపు కేంద్ర బడ్జెట్‌లో ఒడిశా పురోగతి వేగం పుంజుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రికి ప్రతిపాదనల చిట్టా సమర్పించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేసేందుకు కొత్త బడ్జెటులో ప్రత్యేక పెట్టుబడి పథకం (ఎస్ఏసీఐ) కింద రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి గోపాల్‌పూర్‌లో ఉప్పు మేటలు, ఝూర్సుగుడలో కొత్త పారిశ్రామిక టౌన్‌షిప్‌ల నిర్మాణం ప్రోత్సాహవంతంగా నిలుస్తాయన్నారు. పారిశ్రామిక, వర్తక, వ్యాపార రంగాల ఏర్పాటు ప్రోత్సాహానికి దక్షిణ, పశ్చిమ ఒడిశాలో పెట్టుబడులను ప్రోత్సహించే వాతావరణం ఆవిష్కరణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయం అనివార్యమని చెప్పారు. ఆకాంక్ష మండల కార్యక్రమం కింద రాష్ట్రం నుంచి మరికొన్ని మండలాల్ని జోడించాలన్నారు.



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రుల కేంద్ర బడ్జెట్ ముందస్తు ప్రతిపాదనల సమావేశం



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రుల బడ్జెట్ ముందస్తు ప్రతిపాదనల సమావేశం

క్లుప్తంగా

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

● ఉపముఖ్యమంత్రి ప్రభాతి పోరిడా



అధికారులతో చర్చిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రభతి పోరిడా

మల్కన్‌గిరి: జిల్లాలో రెండు రోజులపాటు ఉప ముఖ్యమంత్రి ప్రభతి పోరిడా పర్యటించారు. తొలిరోజు బోండఘటీ, చిత్రకొండలో పర్యటించారు. రెండో రోజు శనివారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధిపై జిల్లా అధికారులతో సత్తిగూడ, చిత్రకొండ, సప్తధర, మల్లికేశ్వర్, గురుప్రీయ, గుమ్మయోరణ, హంతాళ్‌గూడ తదితర పర్యటక ప్రదేశాల్లో మౌలిక వసుతులు సాదుపాయాలు కాల్పిస్తామన్నారు. ఇద్దరు విద్యావంతులను సుభద్ర యోజనలో మహిళలకు సహకారంగా నియమించాలని అధికారులకు ఆదేశించారు. అంగాన్‌వాడీ కేంద్రాల్లోని మౌలిక వసతులపై ఆరా తీశారు. బాల్య వివాహాలను అరికాట్టాలని జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అర్గినైజేషన్ ప్రతినిధులు, బాలాల సంరక్షణ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో, అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రదాన్, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రదాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు

అతి తక్కువ పగటి సమయం

భువనేశ్వర్: నగరంలో శనివారం అతి తక్కువ పగటి సమయం నమోదైంది. ఉదయం 6 గంటలకు సూర్యోదయం, సాయంత్రం 5 గంటలకు సూర్యాస్తమయం జరిగింది. 10 గంటల 55 నిమిషాల నిడివితో పగటి పూట పరిమితమైంది.

కాలువలోకి జారిన బస్సు



కాలువలోకి జారిన బస్సు

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లాలో ప్రైవేటు బస్సు ప్రమాదవశాత్తు కాలువలోకి జారింది. ఈ సంఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. కటక్ నుంచి జంబు వెళ్తుండగా కేంద్రాపడా జిల్లా పాట్టాముండై బొడొపొడా ప్రాంతంలో కాలువలోకి జారింది. గ్రామస్తులు, స్థానిక ఠాణా పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

సమగ్రశిక్ష ఏపీసీగా శశిభూషణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ (ఏపీసీ)గా జిల్లాకు చెందిన డాక్టర్ సంపతిరావు శశిభూషణ్‌ను నియమిస్తూ పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఆయన్ను ఫారిన్ సర్వీస్‌పై ఏపీసీగా నియమిస్తు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈయన డిగ్రీ విద్యార్థులకు ఆరు సెమిస్టర్ పుస్తకాలను(ఇంగ్లిష్) తయారుచేసి, ఉత్తరాంధ్రాలో లక్షకుపైగా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధివిధానాలకు లోబడి కేజీబీవీల బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

29న తూర్పుకాపుల ఆత్మీయ కలయిక

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో 30 లక్షల జనాభా కలిగిన తూర్పుకాపు సామాజికవర్గం శ్రీకాకుళం జిల్లా మహా సమ్మేళనం ఈ నెల 29న ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్ పక్కన స్థలంలో నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ మేరకు నగరంలో ని ఓ ప్రయివేటు కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్, కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మీయ కలయికకు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న తూర్పుకాపు సామాజిక వర్గమంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు, డోల జగన్‌మోహన్, శాసపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావు, లంక శ్యామసుందర్, కిల్లారి నారాయణరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, వాళ్ళ శ్రీరాములునాయుడు, పల్లి సురేష్, డోల బాలు, డాక్టర్ చందక రామకృష్ణ, మిర్తివాడ ప్రభాకర్, నేతల అప్పారావు, ఎం.శంకర్ నారాయణ, బొంతు విజయకృష్ణ, లోలుగు రవి పాల్గొన్నారు.

2.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జి.సిగడాం: జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి తెలిపారు. శనివారం జి.సిగడాం మండలం ఆబోతులపేట, ఆనందపురం గ్రామాల్లో తడిచిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3 లక్షల 60 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా..3లక్షల 45 వేల మంది ఈకేవైసీ చేశామన్నారు. వీరి వద్ద నుంచి మాత్రమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఓలు యర్రా శారద, బాబ్జి, సర్పంచ్ చిత్తిరి మోహన్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ముంతా హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నష్టం

పర్లాకిమిడి: అకాల వర్షాలతో గజపతి జిల్లాలో అనేక వేల ఎకరాల్లో వరి దెబ్బతింది. సంక్రాంతి పండగకి ధాన్యం అమ్మకాలు జరిపి బంధువులతో సంతోషం పంచుకుందామని అనుకుంటే రైతుల ఆశలను అకాల వర్షాలు నీరుగార్చాయి. గుసాని సమితి మధుసూదన్‌పూర్ పంచాయతీ సింగిపురం గ్రామంలో 40 ఎకరాల్లో ధాన్యం నీటిపాలైంది. రంగుమారిన ధాన్యం మిల్లర్లు, మండీలలో అధికారులు కొనుగోలు చేస్తారో లేదో అని సింగిపురం రైతు ధనుంజయ్ విచారం వ్యక్తం చేశారు. గుసాని సమితి కోర్సండ, జాజిపురం, కత్తల కవిటి, ఆర్.సీతాపురంలో ఎగరపోత జరిగిన ధాన్యంను ట్రాక్టర్లలో ఉంచి పరదాలు కప్పుతున్నారు. ఈ శుక్రవారం పర్లాకిమిడిలో 12.80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, శనివారం గజపతి జిల్లాలో పర్లాకిమిడి, గుసాని బ్లాక్‌లో 53.0, 51.0 మిల్లీ మీటర్ల వాన కురిసింది. కాశీనగర్‌లో 52.0., రాయగడలో 35.0, నువాగడలో 38.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది.



గుసాని సమితి ఎంఎస్ పూర్ పంచాయతీలో నీట మునిగిన వరిపంట



మధుసూదనపూర్‌లో నీటమునిగిన వరిపంట



గుసాని సమితి సింగిపురం గ్రామంలో వర్షాలకు తడిసిన ధాన్యం



సింగిపురం గ్రామంలో బురదలోనే ధాన్యం



నీటి మునిగిన ధాన్యం వద్ద లబోదిబోమంటున్న రైతు

రైతన్న దిగాలు



కలెక్టర్లతో వ్యవసాయ శాఖ ప్రముఖ కార్యదర్శి వర్చువల్ సమావేశం

భువనేశ్వర్: వాతావరణ మార్పుతో రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా తెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ అకాల వానలు రైతు కష్టాన్ని నీటిపాలు చేశాయి. దీని ప్రభావంతో వరి మొలకలు తొడిగే ప్రమాదం పొంచి ఉంది. పొలాల్లో పంట నీట తడిసిన మండీలకు చేరిన వరికి ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని రాష్ట్ర సహకార శాఖ మంత్రి ప్రదీప్ బొలో సామంత అభయం ఇచ్చారు. అకాల వర్షాలతో పంట నాణ్యత దిగజారినట్లు ఖరారైతే సముచిత పరిహారం రైతులకు చెల్లిస్తామన్నారు.

తక్షణ చర్యలకు ఆదేశాలు

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రముఖ కార్యదర్శి డాక్టరు అరవింద కుమార్ పాఢి అత్యవసరంగా సమావేశమయ్యారు. ప్రభావిత ప్రాంతాల నుంచి కలెక్టర్లు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాలుపంచుకున్నారు. పంటలపై అకాల వర్షం ప్రభావం తక్షణమే విశ్లేషించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కలెక్టర్లకు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పంట నష్టం నివేదిక దాఖలు చేయాలని తెలిపారు. ప్రత్యేక సహాయ కమిషనరు, పంట బీమా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రభావిత రైతులకు తక్షణమే పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం నీట మునిగిన పంట సంరక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలి. ఈ మేరకు రైతులకు చైతన్యపరచాలని కలెక్టర్లకు వివరించారు.



పూరీ జిల్లా కొణాస్ మండలంలో అకాల వర్షాలతో పొలాల్లో నీట మునిగిన వరి పంట

వర్షాలు తగ్గుతాయి

భువనేశ్వర్: రానున్న 12 గంటల్లో వర్షాలు తగ్గుతాయని స్థానిక ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో శుక్రవారం నుంచి తెరిపి లేకుండ వర్షాలు కురుస్తున్నాయి. గంజాం, గజపతి, రాయగడ, కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలకు వర్ష సూచన జారీ చేసినట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం డైరెక్టరు మనోరమ మహంతి తెలిపారు. నయాగడ్ జిల్లా రొణొపూర్‌లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ ప్రాంతంలో గత 24 గంటల్లో అత్యధికంగా 108.4 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయినట్లు స్థానిక ప్రాంతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో 60 మిల్లీ మీటర్లు పైబడి వర్షపాతం నమోదైంది.

జిల్లా	ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
ఖుర్దా	బెగుణియా	84.0
ఖుర్దా	జట్నీ	75.0
ఖుర్దా	ఖుర్దా టౌను	75.0
పూరీ	పిప్పిలి	75.0
జగత్‌సింగ్‌పూర్	నువాగాంవ్	73.0
ఖుర్దా	బొణొపూర్	70.0
గంజాం	బెల్లొగుంఠ	69.2
పూరీ	కృష్ణప్రసాద్	67.0
పూరీ	గోప్	66.0
గంజాం	పురుషోత్తంపూర్	65.0
ఖుర్దా	టంగి	62.0
జగత్‌సింగ్‌పూర్	జగత్‌సింగ్‌పూర్	61.2
జగత్‌సింగ్‌పూర్	పారాదీప్	61.1

ముగిసిన అంతర్జాతీయ సెమినార్



అంతర్జాతీయ స్కోప్స్ ముగింపు సమావేశంలో పాల్గొన్న అతిథులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ వర్సిటీలో గత మూడు రోజులుగా జరుగుతున్న రెండో అంతర్జాతీయ స్కోప్స్ (సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్, పవర్, ఎంబెడెడ్ సిస్టం) ముగింపు సమావేశం శనివారం ఓపెన్ ఆడిటోరియంలో జరిగింది. ఈ ముగింపు సమావేశానికి డీఆర్‌డీఏ మాజీ డైరక్టర్ డాక్టర్ పి.ఎస్.ఆర్.శ్రీనివాస శాస్త్రి, డిసాల్ట్ సిస్టం, ఇండస్ట్రీ ప్రాసెస్ కన్సల్టెంట్ డాక్టర్ రఫేల్ స్కుడేరీ, డాక్టర్ నయీం హస్నన్ (మలేషియా), డాక్టర్ రేణుకా శ్రీనివాసన్ (డిసాల్ట్ సిస్టం), ఐఐటీ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ గణపతి పండా, మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపల్ మ్యానేజర్ సునీల్ సాబత్, డాక్టర్ జగన్నాథ నాయక్ (డి.ఆర్.డి.ఓ), మార్య్యాసెమీ కండక్టర్ సీ.ఈ.ఓ పూర్ణచంద్ర మహంతి తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో 632 పరిశోధన పేపర్స్ ఆమోదించగా, వాటిలో 229 ఆన్‌లైన్‌లో ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇలాంటి అంతర్జాతీయ సమావేశం ఏర్పాటుచేసిన సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు డి.ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షులు ఆచార్య డి.ఎన్.రావు, డాక్టర్ దేవేంద్ర కుమార్ సాహు, ఉపకులపతి డాక్టర్ బిశ్వజిత్ మిశ్రాను ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ దేవేంద్ర కుమార్ సాహు అభినందించారు. అనంతరం ముఖ్యమైన అతిథులకు జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్ (ఇంజినీరింగ్ స్కూల్) డాక్టర్ ప్రఫుల్ల కుమార్ పండా, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాడి, ప్రొఫెసర్ అశోక్ మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

కత్తులతో బెదిరించి దోపిడీకి యత్నం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని నిత్యం రద్దీగా ఉండే కిన్నెర కాంప్లెక్సు సమీపంలోని ఓ వ్యాపారవేత్త ఇంట్లో శనివారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ముగ్గురు దుండగులు కత్తులతో బెదిరించి మరీ దోపిడీయత్నానికి పాల్పడ్డారు. ఒకటో పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిన్నెర కాంప్లెక్సు సమీపంలోని కాకివీధి పాయింట్ వద్ద వ్యాపారవేత్త కోరాడ గోవింద్ ఇంటికి గేటు తీసుకుని ఇద్దరు, పెరడు నుంచి మరో దుండగుడు కాయగూరలు కోసే కత్తులతో వెళ్లి చొరబడ్డారు. కుటుంబసభ్యులను కత్తులతో బెదిరించసాగారు. ఈలోగా గోవింద్ కుటుంబసభ్యులు ఇంట్లో ఉన్న కర్రలను, కత్తి పీటలను అందుకుని ప్రతిఘటించారు. కేకలు విని స్థానికులు రావడంతో దుండగులు పరారయ్యారు.డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు, క్లూస్ టీమ్ సిబ్బందితో చేరుకు పరిసరాలను పరిశీలించారు. వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదుగుతున్న గోవింద్ కుటుంబంపై కక్ష తీర్చుకునేందుకు వచ్చారా? లేక గోవింద్ ఇంటిపక్కనే హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం ఉండటంతో అందులో చోరీకి వచ్చారా? అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పైడపునాయుడు పేర్కొన్నారు.



గోవింద్ కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కింజరాపు శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడేళ్ల పాటు సేవలందించనున్నారు. శ్రీనివాసరావు నియామకం పట్ల బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం హర్షం వ్యక్తం చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

ఎచ్చెర్ల క్యాంపస్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. దేశానికి క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు పి.రవికుమార్, ఎం.చిన్నసుబ్బారావు, వై.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాలకు నిలయం గజపతి



నాల్గో రోజు గజపతి ఉత్సవాల ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్

● వైభవంగా నాల్గో రోజు గజపతి ఉత్సవాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ప్రకృతి సౌందర్య జలపాతాలు, పర్యాటక కేంద్రాలైన మహేంద్రగిరి, గుడ్‌గుడా, గండాహతి వంటివి ఉన్నాయని, వీటిని ప్రస్తుతం రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం ఆనందదాయకమని బలంఘీర్ జడ్జి పవిత్ర మోహన్ సామల్ అన్నారు. శనివారం గజపతి స్టేడియంలో నాల్గో రోజు ఉత్సవాలను జిల్లా జడ్జి ప్రణబ్‌కుమార్ రౌత్రాయ్, పవిత్ర మోహన్ శామల్ ప్రారంభించారు. వేదికపై పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి బాలముకుంద భుయ్యాన్, ఐఐటీ రూర్కీ డా.పాణిగ్రాహి, కేంద్రపడా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, రాయగడ జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, సి.ఎస్.ఐ.ఆర్. వైజ్ఞానికులు సరోజ్ కుమార్ పాణిగ్రాహి, డి.ఎఫ్.ఓ ఎస్.ఆనంద్, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా వున్నారు. జిల్లా కలెక్టర్, సంస్కృతి శాఖ చైర్మన్ బిజయ కుమార్ దాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయోధ్యలో బాలరాముని సూర్యతిలకం ప్రాజెక్టులో ముఖ్యపాత్ర వహించిన సరోజ్ కుమార్ పాణిగ్రాహిని కలెక్టర్ సత్కరించారు. గౌరవ అతిథులు కేంద్రపడా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రదాన్, రాయగడ ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌ను కలెక్టర్ సత్కరించారు. పలువురికి ప్రకృతి మిత్ర అవార్డులను కలెక్టర్ అందజేశారు. గజపతి స్టేడియంపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వర్షం వెలిసిన తరువాత గజపతి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేశారు.



వైజ్ఞానికులు సరోజ్ కుమార్ పాణిగ్రాహికి పౌరసత్కారం చేస్తున్న కలెక్టర్



జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్‌కు సత్కారం



రాజస్థానీ నృత్యం



భరత నాట్యం ప్రదర్శిస్తున్న స్థానిక కళాకారులు



కేంద్రపడా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రదాన్‌కు సత్కారం

జీఐఈటీలో సృజన్ 3.0



వేదికపై చంద్ర ధ్వజ పండ, తదితర ప్రముఖులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో గల గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో శనివారం నుంచి సృజన్ 3.0 పేరిట వార్షిక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ చంద్ర ధ్వజ పండ మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కన్వీనర్ డాక్టర్ బిదు ప్రసాద్ స్వాగతోపన్యాసం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీ జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుండడంతో వారికి ఉపాధి దొరుకుతోందన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్స్, విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా రూ.3580 కోట్లు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం శ్రీకాకుళం రామలక్ష్మణ కూడలిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా విద్యా దీవెన, వసతి దీవెనలు(ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్) చెల్లించడంలో అలసత్వం వహిస్తోందన్నారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం యాజమాన్యాల వద్ద ఏడు లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు ఉన్నాయని చెప్పారు. ఉన్నత విద్యకు సంబంధించి జీవో 77పై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పూర్ణ, రాజు, ప్రవీణ్, రమేష్‌కుమార్, శ్రీను, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అమర సైనికుడికి ఘన నివాళి



జయపురంలో ఈశ్వర్ అమర రహే అంటూ నినాదాలు చేస్తున్న యువకులు



బొయిపరిగుడలో బైక్ ర్యాలీతో మృతదేహం వెంట వెళ్తున్న జన సమూహం

జయపురం: రాజస్థాన్‌లోని పోఖ్రాన్ రేంజ్‌లో ఫైరింగ్ అభ్యసిస్తున్న సమయంలో బుధవారం అకస్మాత్తుగా ట్యాంకర్ పేలడంతో సైనికుడు ఈశ్వర్ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. 46వ ఆర్మ్‌డ్ రెజిమెంట్ కమాండ్ ఆఫీసర్ ఈశ్వర్ పార్థివ దేహానికి గార్డ్‌ఆఫ్ హానర్ ఇచ్చిన తరువాత శనివారం ఉదయం 8 గంటల సమయంలో విమానంలో విశాఖపట్నం తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో అతడి స్వగ్రామం బొయిపరిగుడ సమితి బొడగుడ గ్రామానికి పార్థివదేహాన్ని తీసుకెళ్లారు. దారంతా ఈశ్వర్‌కు నివాళులర్పిస్తూ నినాదాలు చేశారు. బొయిపరిగుడలో వందలాది మంది యువత మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు.

క్లుప్తంగా

ఆంధ్ర మహిళా క్రికెట్ అండర్-19 జట్టుకు హారిక ఎంపిక



రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన కోరుకొండ హారిక

విజయనగరం అర్బన్: ఆంధ్ర రాష్ట్ర మహిళా క్రికెట్ అండర్ - 19 జట్టుకు పట్టణానికి చెందిన శ్రీలక్ష్మి గణపతి డిగ్రీ కళాశాల బీకాం రెండో సంవత్సర విద్యార్థిని కోరుకొండ హారిక ఎంపికైంది. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు నుంచి ఎంపిక ఆదేశాలు వచ్చాయని కళాశాల కరెస్పాండెంట్ వై.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 4న కేరళలో జరిగే వన్‌డే క్రికెట్ పోటీలలో పాల్గొనే ఆంధ్ర మహిళా క్రికెట్ అండర్-19 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో హారికను కళాశాల యాజమాన్యం, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

బడిగంట మోగాక సెలవు కబురు

- ప్రహసనంగా హాజరు తంతు



వర్షంలో స్కూల్ నుంచి తిరిగి వచ్చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: తుఫాన్ కారణంగా రెండు రోజుల క్రితం నుంచి జిల్లాలో కురుస్తున్న వర్షాలు విద్యార్థుల, ఉపాధ్యాయుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని భావించిన జిల్లా యంత్రాంగం శనివారం సెలవు ప్రకటించింది. అయితే సకాలంలో ఆదేశాలు ఇవ్వకపోడం వల్ల సెలవు ఉద్దేశం నెరవేరలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పలేదు. శనివారం తెల్లవారుజాము నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. సెలవు ప్రకటిస్తారని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఎదురు చూసారు. సెలవు ప్రకటిస్తున్నట్లు ఉదయం 8.50 గంటలకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారాన్ని జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఆ సమయానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు విధిగా హాజరై ప్రార్థన ప్రక్రియలో ఉన్నారు. తరగతి గదుల్లోకి విద్యార్థులు వెళ్లి హాజరు తీసుకున్న తరువాత సెలవు సమాచారాన్ని ఉపాధ్యాయులు తెలుసుకున్నారు. అప్పుడే ఉత్సాహంగా స్కూళ్లకు వచ్చిన పిల్లల్ని ఇంటికి పంపలేక, జిల్లా యంత్రాంగం సెలవు ఆదేశాలను పాటించలేక మధ్యాహ్నం భోజనం వరకు ఉంచి రెండో పూట పాఠశాల నిర్వాహకులు సెలవు ప్రకటించారు. దీంతో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు కూడా ప్రహసనంగా మారింది. జిల్లా యంత్రాంగం ప్రకటించిన మేరకు సెలవు దినమా? లేక ఒక పూట విధులు నిర్వహించినందున హాఫ్ డే పని దినమా? తేలక హాజరు తంతు ప్రహసనంగా మారింది.

డీఎంహెచ్‌ఓగా జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌ఓ)గా విశాఖపట్నం జిల్లా వ్యాధి నిరోధకటీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి పదోన్నతిపై నియామకమయ్యారు. ఇక్కడ డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎస్.భాస్కరరావుకు పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయింది. ఈ మేరకు శనివారం వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిఎం.టి. కృష్ణబాబు ఉత్తర్వులు జారీచేశారు.

పంటల బీమా గడువు పెంపు

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: రబీ పంటలకు బీమా గడువును ఈ నెలాఖరువరకు పెంచామని, రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. జిల్లాలో రబీలో 5,801 హెక్టార్లలో మొక్కజొన్న, 4,081 హెక్టార్లలో పెసర, 10,067 హెక్టార్లలో మినుము పంట సాగువుతోందన్నారు. వరి, మొక్కజొన్న, పెసర, మినుము తదితర పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతు సేవా కేంద్రం అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.630, మొక్కజొన్నకు రూ.540, పెసర, మినుము పంటలకు రూ. 300 వంతున ప్రీమియం చెల్లించి బీమా సదుపాయం పొందాలన్నారు.

సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: నూతన సంవత్సరం, సంక్రాంతి పండగను పురస్కరించుకుని 'సంక్రాంతి పురస్కారం-2025'కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సర్వేజనా సుఖినోభవంతు సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈఎస్ఎన్ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఇంజినీర్లు, యోగా, మెడిటేషన్, సంగీత, నృత్యగురువులు, క్రీడాకారులు, మేధావుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా మాజీ సీఎం జగన్

- నాగళ్లవలసలో రెండు కుటుంబాలకు పరిహారం
- రూ.2 లక్షల చొప్పున చెక్‌లు అందజేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



నాగళ్లవలసకు చెందిన బూరి నీలమ్మకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



బూరి శాంతకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: డయేరియా కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని, మాట ఇవ్వడమే కాకుండా అమలు చేసి చూపించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గుర్ల మండలంలోని నాగళ్లవలసలో డయేరియా కారణంగా మృతి చెందిన రెండు కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పంపిన రూ.2 లక్షల చెక్కులను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్ల మండలంలో డయేరియా విజృంభించడంతో 13 మంది మృతి చెందడంతో కుటుంబాలు అనాథలుగా మిగిలాయన్నారు. అదే సమయంలో ఆ కుటుంబాలను ఓదార్చేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున పరిహారం అందజేస్తామని మాట ఇచ్చారని, ఆ మాట ప్రకారం ఇప్పటికే 11 కుటుంబాలకు పరిహారం చెక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. తాజాగా నాగళ్లవలసకు చెందిన బూరి శాంతి, బూరి నీలమ్మలకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన చెక్కులను అందజేసినట్లు చెప్పారు. గుర్ల డయేరియా బాధిత కుటుంబాలకు మాజీ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని స్పష్టం చేసారు. కానీ ప్రభుత్వం కనీసం బాధిత కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుర్ల మండల నాయకులు కెవి. సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాశినాయుడు, శీర అప్పలనాయుడు, స్వామినాయుడు, తోట తిరుపతి, బెల్లాన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైనిక స్కూల్‌లో విద్యనభ్యసించడం పూర్వజన్మ సుకృతం

- ప్రిన్సిపాల్ ఎస్ఎస్.శాస్త్రి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో విద్యనభ్యసించడం పూర్వజన్మ సుకృతమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్.శాస్త్రి పేర్కొన్నారు. పాఠశాలలోని పివిజి.రాజు ఆడిటోరియంలో శనివారం జరిగిన వార్షికోత్సవ ముగింపుతో పాటు పేరేంట్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కోరుకొండ సైనిక పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల ప్రయాణంలో మరో మైలురాయిని సూచిస్తున్నాయన్నారు. ఇక్కడ విద్యతో పాటు వ్యక్తిగత జీవనశైలి, క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకితభావం, కుటుంబ విలువల వంటి ఎన్నో లక్షణాలను నేర్చుకోవడం తద్వారా వాటిని అమలు చేయడంలో పలువురికి ఆదర్శవంతులవ్వడం జరుగుతుందన్నారు. ముందు తరం విద్యార్థులు ఎంతో మందికి నేడు ప్రపంచంలోనే ఉన్నత స్థాయిలో ఉండి పాఠశాలకు, తద్వారా దేశానికి ఎంతో కీర్తిని తీసుకువచ్చారన్నారు. అనంతరం పాఠశాల విజయాలు, విద్యావేత్తలు, క్రీడలు, పాఠ్యాంశాలలో క్యాడెట్ల అద్భుతమైన ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా ప్రతిభను, సృజనాత్మకతను చాటిచెప్పే సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

24న జిల్లా స్థాయి బాలుర కబడ్డీ పోటీలు

విజయనగరం: కబడ్డీ, ఖోఖో క్రీడల పితామహుడు దివంగత వై.భగవాన్‌దాస్ మాస్టారు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 24న జిల్లా స్థాయి ఉన్నత పాఠశాలల బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు భగవాన్‌దాస్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విజయనగరం జిల్లా కేంద్రంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో ప్రస్తుతం ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బాలుర క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు 94906 63367, 94947 77753 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యే తనయుడి వాహనం ఢీకొని..

- నలుగురికి తీవ్ర గాయాలు
- కొరసవాడ యాతపేట వద్ద ఆటోను ఢీకొన్న స్కార్పియో
- ఇద్దరి పరిస్థితి విషమం



నుజ్జయిన ఆటో



తోటలోకి దూసుకుపోయిన స్కార్పియో



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ యాతపేట సమీపంలో జాతీయ రహదారిపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు సాయి గణేష్ ప్రయాణిస్తున్న స్కార్పియో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం శివశంకర్ కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు సింగ ఆనంద్ శనివారం మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన చెప్పల బోగయ్య, సంతు, సవలాపురం నరేష్, గణేష్‌లు కలిసి ఆటో డ్రైవర్ కుర్మాన సునీల్‌తో కలిసి వచ్చారు. పరామర్శ అనంతరం స్వగ్రామం తిరిగి వెళ్తుండగా శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కొరసవాడ యాతపేట సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు మామిడి సాయి గణేష్ ప్రయాణిస్తున్న స్కార్పియో ఢీ కొట్టింది. ఆటో బోల్తాపడగా.. స్కార్పియో పక్కనే ఉన్న టేకు తోటలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న నలుగురితో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే తనయుడు సాయిగణేష్, డ్రైవర్ రాజేష్‌లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న సీఐ వి.రామారావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో పాతపట్నం సీహెచ్‌సీకు తరలించారు. వైద్యులు మన్మధరావు, విక్రమ్, దేవి ప్రసాద్‌లు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్సకోసం అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చెప్పల బోగయ్యకు, చెప్పల సంతుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామారావు తెలిపారు.

అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు

విజయనగరం అర్బన్:

వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 73 కేంద్ర పథకాలు ప్రారంభమయ్యాయని మరో 20 పథకాలు త్వరలో అమలు కానున్నాయని తెలిపారు. వాటిని జిల్లా అభివృద్ధికి అన్వయించడంలో నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ మార్పు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వ్యవసాయం, విద్యుత్, సమగ్ర శిక్ష, జాతీయ రహదారుల నిర్మాణం, వైద్యారోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, పరిశ్రమలు, పశు సంవర్ధకం, స్వచ్ఛ భారత్, జలజీవన్ మిషన్ తదితర పథకాలపై సమీక్షించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, లోకం మాధవి, జెడ్పీ సీఈఓ బీవీసత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ ఆర్.వెంకటరామన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అదనపు జడ్జి

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య స్థితిగతులపై సబ్ జైల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అదనపు జడ్జి సీహెచ్ వివేకానంద శ్రీనివాస్ కోరారు. పాలకొండ సబ్ జైల్‌లో స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయరాజుకుమార్‌తో కలసి శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న న్యాయ సేవలపై ఆరా తీశారు. వారు చేసిన నేరం, బెయిల్ విషయంలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు పరిసరాలు, పారిశుద్ధ్య నిర్వహణ, భోజనం, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట శ్రీకాకుళం సబ్ జడ్జి ఆర్.సన్యాసిరావు, న్యాయవాదులు బి.రామ్మోహనరావు, ఆర్.కుమారస్వామి, ఎస్.సింహాచలం, జైల్ ఇన్‌చార్జి పి.చంద్రరావు, వార్డర్లు బి.విజయకుమార్, హేమసుందర్, ఏఎస్సై శ్రీనివాస్‌నాయుడు తదితరులు ఉన్నారు.

జగన్ అంటే ఓ ప్రభంజనం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం ఇన్‌చార్జ్ డాక్టర తలే రాజేష్ తదితరులు

రాజాం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఓ ప్రభంజనమని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా రాజాంలో పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను పాటించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అబద్దపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ఆరు నెలల్లోనే ప్రజా వ్యతిరేకత చవి చూస్తుందన్నారు. ఒక్క హామీని కూడా అమలు చేయలేక చేతులెత్తిసిందన్నారు. ప్రజా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు ప్రజలకు పండగ రోజులా ఉందని, అందుకే అందరూ వాడవాడలా ఆయన జన్మదిన వేడుకలను పండగలా జరుపుతున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ కూటమి అరాచకాలను ఎండగట్టారు. మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, రాజాం, రేగిడి, వంగర మండలాల పార్టీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, వావిలపల్లి జగన్మోహనరావు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం పొందండి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టివి.రాజేష్‌కుమార్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టీవీ రాజేష్ కుమార్

విజయనగరం క్రైమ్: రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు ఎవరూ న్యాయవాది లేకుండా ఉండకూడదని, అలాంటి వారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయవాదిని ఉచితంగా అందిస్తుందని అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టివి.రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి ఆదేశాలతో శనివారం విజయనగరం సబ్‌జైల్‌ను సందర్శించారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి, వారికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. 70 ఏళ్లు పైబడిన వృద్ధులు, అస్వస్థతతో ఉన్నటువంటి ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్, ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయసహాయమందించేందుకు జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేశామని, వాటిని సక్రమంగా కొనసాగించాలని సూచించారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయమందించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమన్నారు. జైల్లో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని, భోజనశాలను, స్టోర్ రూమ్ తదితర వాటిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ బి.సంపత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి వ్యాపారుల నుంచి ఆస్తులు కొనుగోలు చేయొద్దు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



విజయనగరం క్రైమ్: గంజాయి వ్యాపారం ద్వారా ఆస్తులు కూడబెట్టిన వ్యక్తుల నుంచి ఎవరూ ఆస్తులు కొనుగోలు చేయవద్దని ప్రజలకు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అక్రమ వ్యాపారాలతో కూడబెట్టిన ఆస్తులను, వారి నుంచి తిరిగి ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టపరమైన చిక్కులు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, అమ్మకాలు నిర్వహించి, ఆస్తులు కూడబెడితే వాటిని సీజ్ లేదా జప్తు చేసేందుకు పోలీసు శాఖ చర్యలు చేపడుతుందన్నారు. రేంజ్ పరిధిలో ఇటువంటి అక్రమ వ్యాపారాలకు పాల్పడిన వ్యక్తులను ఇప్పటికే గుర్తించామని, వారి ఆస్తులను సీజ్ చేసేందుకు చట్టపరమైన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ఏమైనా నూతనంగా ఆస్తులు కొనుగోలు చేసే ముందు సదరు విక్రయదారులు ఆయా ఆస్తులు ఏ విధంగా సంక్రమించాయి, వాటి చట్టపరమైన స్థితిని ముందుగా ధ్రువీకరించుకోవాలన్నారు. లేకుంటే కొనుగోలుదారులు చట్టపరమైన, ఆర్థికపరమైన సమస్యల్లో చిక్కుకుపోతారన్నారు. అటువంటి ఆస్తులతో కూడిన లావాదేవీలతో కొనుగోలుదారులకు చట్టపరమైన తీవ్ర పరిణామాలు తప్పవని సూచించారు. ఇదేరకంగా అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలానికి చెందిన పడాల నాగేశ్వరరావు అనే వ్యక్తి దశాబ్ద కాలంగా గంజాయి వ్యాపారం సాగించి, తన పేరున, భార్య పేరున 15.36 ఎకరాల భూములు కొనుగోలు చేశారని, సదరు భూమి విలువ రూ.62.80 లక్షలు ఉంటుందని విచారణలో వెల్లడైందన్నారు. ఈ ఆదాయం అక్రమ సంపాదనగానే గుర్తించడం జరుగుతుందన్నారు.

ప్రతీ పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్‌ను ప్రవేశపెట్టాలి

బొబ్బిలి రూరల్: పాఠశాలలోని విద్యార్థులకు మానసిక పటుత్వంతో పాటు వికాసం, శారీరక ధైర్యం, దేశభక్తిని తెలియజేయాలంటే ప్రతీ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో పాటు ఎన్‌సీసీని ప్రవేశపెట్టాలని డెల్టా సంఘ అధ్యక్షుడు మింది విజయమోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని అలజంగి ఎంపీపీ పాఠశాలలో ఆ సంఘ సభ్యులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో ప్రాథమిక హక్కులు, సామాజిక బాధ్యత, స్వీయ రక్షణ తదితర అంశాల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొలానికి వెళ్లి.. విగతజీవులుగా మారి..



విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన శ్రీను, సింహాచలం

జియ్యమ్మవలస: వారిది ఉమ్మడి కుటుంబం. వ్యవసాయమే జీవనాధారం. ఇంటిల్లిపాదీ ఆరుగాలం పొలంలో శ్రమిస్తూ కుటుంబాలను నెట్టుకువస్తున్నారు. ఇప్పుడు ఆ పొలంలోనే ఒక్కొక్కరుగా తనువుచాలిస్తుండడం కలవరపరుస్తోంది. ఐదేళ్ల కిందట పెద్దన్నయ్య కృష్ణ పొలంలోనే మృతి చెందగా.. ఇప్పుడు పొలానికి వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జియ్యమ్మవలస మండలం శిఖబడి గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు వైకుంఠపు శ్రీను (45), సింహాచలం(43) ఎస్టీ మరువాడ వద్ద ఉన్న పొలంలో రబీ వరి పంట కోసం నారుమడి సిద్ధం చేసేందుకు శనివారం ఉదయం వెళ్లారు. ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్‌చేశారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా ఇద్దరూ విగతజీవులుగా పడి ఉన్నారు. మోటారు వేసే సమయంలో సపోర్టు వైరుకు విద్యుత్ ప్రసరించడం, దానికి వారు తగలడంతో షాక్‌కు గురై మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. మృతుల్లో శ్రీను ఇద్దరు కుమారుల్లో చక్రధర్ ఎంసీఏ చేస్తుండగా వెంకటేష్ ఐటీఐ చదివి ప్రైవేటు ఉద్యోగంలో ఇటీవల చేరాడు. సింహాచలంకు రమ్య అనే పాప డిగ్రీ చదువుతుండగా రమేష్ ఐటీఐ చదువుతున్నాడు. ఐదేళ్ల కిందట మృతిచెందిన కృష్ణకు ఇద్దరు అమ్మాయిలు ఉండగా వారికి పెళ్లిళ్లు జరిగాయి. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. మృతుల తండ్రి మరణించగా తల్లి మహాలక్ష్మి ఉంది. ఇంటికి పెద్ద దిక్కును మృత్యువు కాటేయడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసన్నకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- నయంత యూనివర్సిటీ సీఈఓ రంజన్ బెనర్జీ
- సెంచూరియన్‌లో ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు
- విద్యార్థులకు డిగ్రీల ప్రదానం



సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విద్యార్థికి డిగ్రీ పట్టాను అందజేస్తున్న అతిథులు



సమావేశంలో మాట్లాడుతున్న నయంత యూనివర్సిటీ సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ

నెల్లిమర్ల రూరల్: అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నయంత విశ్వ విద్యాలయం సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ 4వ స్నాతకోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినప్పుడే గొప్ప విజయాలు సొంతమవుతాయన్నారు. ఉన్నత స్థాయికి వెళుతూనే ఇతరులకు చేయూతనివ్వాలన్నారు. ఇతరుల జీవితాల్లో చిరునవ్వులు చూడగలిగినప్పుడే మంచి విజయాలు సాధించినవారమవుతామన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్‌రావు విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. వర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఏడేళ్ల వ్యవధిలోనే దేశంలో అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాల్లో ఒకటిగా సెంచూరియన్ అవతరించిందన్నారు. వైస్ చాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ వర్సిటీను వ్యాపారం కోసం స్థాపించబడలేదని, శక్తివంతమైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 201 మంది విద్యార్థులకు డిగ్రీలు, మరో ఐదుగురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, 16 మందికి బంగారు పతకాలు, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను వక్తలు అందజేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్ వర్సిటీ వీసీ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ పల్లవి, పాలకమండలి సభ్యుడు, పారిశ్రామికవేత్త కుమార్ రాజా, డాక్టర్ పి.ఎస్.ఠాగూర్, ప్రొఫెసర్ కె.సి.బి.రావు, పీఎస్ఎస్‌వీ నరసింహం, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.